అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 15 ఫిబ్రవరి 2023

డబుల్ బెడ్ రూమ్ కోసం 16న గ్రామ సభ

నవతెలంగాణ-నార్నూర్

ఈ నెల 16న మండల కేంద్ర గ్రామ పంచాయతీలో ఉదయం 11 గంటలకు డబుల్ బెడ్ రూం కొరకు సర్పంచ్ అధ్వర్యంలో నిర్వహించే గ్రామసభను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ అమృత్‌లాల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇల్లు లేని గిరిజనులను మాత్రమే డబుల్ బెడ్ రూమ్‌కు ఎంపిక చేస్తామని తెలిపారు.

ఉపాధి, పునరావాసానికి ట్రాన్స్‌జెండర్లు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని అర్హులైన ట్రాన్స్‌జెండర్లు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు స్వయం ఉపాధి కింద యూనిట్ల మంజూరు కొరకు ప్రభుత్వం వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్ల సంక్షేమ శాఖ ద్వారా ఉపాధి, పునరావాస పథకం నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ హేమంత్ సహదేవ్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వ్యవసాయం, అనుబంధ పరిశ్రమలు, సేవా వ్యాపారాలను స్థాపించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా జిల్లాకు 2 యూనిట్ల ద్వారా లక్ష రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, దరఖాస్తు చేసుకునే ట్రాన్స్‌జెండర్లు కలెక్టర్ జారీ చేసిన గుర్తింపు కార్డు, కాంపిటెంట్ అథారిటీ జారీ చేసిన ట్రాన్స్‌జెండర్ సర్టిఫికెట్ తప్పనిసరిగా కలిగి నేషనల్ పోర్టల్‌లో రిజిస్టర్ అయి ఉండాలని పేర్కొన్నారు.

నేటి నుంచి ఇంటర్ ప్రయోగ 'పరీక్ష'లు..!

- వేధిస్తున్న మౌళిక వసతుల కొరత
- విద్యార్థులకు ఎదురుకానున్న ఇబ్బందులు
- ఉమ్మడి జిల్లాలో ప్రారంభం కానున్న పరీక్షలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నేటి నుండి ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మార్చి 2వ తేదీ వరకు నిర్వహించే ఈ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మూడు దశల్లో జరగనున్న ఈ పరీక్షలకు సర్కారు కళాశాలల్లో అరకొర వసతులు ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. సర్కారు కళాశాలల్లో మొక్కుబడిగా నిర్వహిస్తుండగా, ప్రయివేటు కళాశాలల్లో వారి కేంద్రాల్లోనే పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఒకేసారి నిర్వహిస్తుండటంతో ఆయా కేంద్రాల్లో సందడి వాతావరణం కనిపించనుంది.



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్ జిల్లాలో 50కేంద్రాలు ఏర్పాటు చేయగా 8389మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో పరీక్షల కోసం 55 సెంటర్లను అధికారులు ఎంపిక చేశారు. వీటిలో మంచిర్యాల జిల్లాలో 24 సెంటర్లు జనరల్ విద్యార్థుల కోసం కేటాయించగా 7270 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో జనరల్‌తో పాటు ఒకేషనల్ విద్యార్థుల కోసం 31 సెంటర్లు కేటాయించగా వీటిల్లో జనరల్ విద్యార్థులు 2713 మంది పరీక్ష రాయనుండగా, ఒకేషనల్ విద్యార్థులు 1463 మంది పరీక్షలకు హాజరుకానున్నారు.

ప్రాక్టికల్ పరీక్షల్లో నెరవేరని లక్ష్యం

విద్యార్థికి తన ఏదైతే సబ్జెక్టు చదువుతున్నాడో దానిపై నిత్య జీవితంలో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సైన్స్ గ్రూపులు చదువుతున్న విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తోంది. పుస్తకాల్లో చదువుకున్న దానిని నిజ జీవితంలో ఏ విధంగా ఉపయోగించుకుంటారనే విషయం ఈ పరీక్షల ద్వారా విద్యార్థులకు అవగతం చేయాల్సిన అవసరం అధ్యాపకులపై ఉంటుంది. కానీ ప్రభుత్వ కళాశాలలో సరైన వసతులు లేక ప్రైవేట్ కళాశాలలు ఈ పరీక్షలపై పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో తూతూమంత్రంగా పరీక్షలు నడుస్తున్నాయి. ప్రస్తుతం ప్రతి చోట ప్రభుత్వం అనుకున్న లక్ష్యం పరీక్షల ద్వారా నెరవేరడం లేదు.

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లా లో మొత్తం 55 సెంటర్లలో ప్రాక్టికల్ పరీక్షలు నేపథ్యంలో ఇప్పటికే ఆయా జిల్లాల అధికారులు సెంటర్ల పరిశీలన ఎగ్జామినర్ల నియామకాలు పూర్తి చేశారు. రెండు జిల్లాల కలెక్టర్లు ఇప్పటికే అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి విద్యార్థులకు పరీక్షలకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు కాకుండా చూడాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో వారికి కావాల్సిన మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. నేటి నుండి విద్యార్థులు పరీక్ష రాయనున్న నేపథ్యంలో వారు చేయాల్సిన ప్రయోగాలను అధ్యాపకులు అందించడంతో పాటు పరీక్షలకు పూర్తిగా వారిని సిద్ధం చేశారు.

పకడ్బందీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశాం : శ్రీధర్ సుమన్, జిల్లా మాధ్యమిక విద్యాధికారి

జిల్లాలో కొంత వసతులు లేమి ఉన్నప్పటికీ విద్యార్థులకు ఇబ్బంది కాకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి అధ్యాపకులను ఎప్పటికప్పుడు సిద్ధం చేస్తూనే విద్యార్థులకు అన్ని విషయాలు నేర్పేలా ఆదేశాలు జారీ చేశాం. ఇంకా ఎక్కడైనా ఇబ్బందులు కన్పిస్తే దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

ఆర్థిక సంవత్సరానికి 46 రోజులే మిగిలి ఉంది : జీఎం సంజీవరెడ్డి



నవతెలంగాణ-నస్పూర్

ఈ ఆర్థిక సంవత్సరానికి ఇంకా 40 రోజులే మిగిలి ఉందని, ఉత్పత్తి, రవాణా, ఓబి లక్ష్యాలను సాధిస్తూ ముందుకు వెళ్లాలని సంబంధిత అధికారులకు శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి సూచించారు. మంగళవారం అడ్వైజర్ మైనింగ్ డిఎస్ ప్రసాద్, ఏరియా జనరల్ మేనేజర్ శ్రీరాంపూర్ ఉపరితల గనిలో బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబి వెలికితీత, కొత్త కాంట్రాక్టు పనితీరు, భూసేకరణ సంబంధిత అంశాలపై రివ్యూ చేశారు. ఈ సందర్భంగా అడ్వైజర్ మైనింగ్ డిఎస్ ప్రసాద్, ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి వ్యూ పాయింట్ నుండి పని స్థలాలను పరిశీలించారు. శ్రీరాంపూర్ ఉపరితల గనిలో రోజువారి ఉత్పత్తి లక్ష్యాలను సాధించడం, రోజువారి ఓబి వెలికితీ లక్ష్యాల సాధనకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి షిఫ్ట్ వారిగా రక్షణతో కూడిన నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి సాధించాలని, అత్యధిక ఓవర్ బర్డెన్ వెలికితీత సాధించే విధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. భూసేకరణ, డంప్ ఏరియా, కోల్ క్వాలిటీ, మిషనరీ పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ సుధీర్, సర్వే అధికారి రామ్మోహన్, కాంట్రాక్ట్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

హమారా ప్రసాద్ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-బోథ్

మండలంలోని సోనాల గ్రామంలో అంబేద్కర్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో హమారా ప్రసాద్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం మండల ప్రధాన కార్యదర్శి బత్తుల రమేష్ మాట్లాడుతూ ప్రసాద్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. దేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహానియునిపై వ్యాఖ్యలు చేసిన ప్రసాద్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బుద్ధమహార్ సంఘం అధ్యక్షుడు పాటిల్ అమృత్ రావు, అంబేద్కర్ సంఘం నాయకులు సంఘపాల్, ప్రభాకర్, రాము, పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నిత్యావసరాలు పంపిణీ



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని గొడిసెర గ్రామానికి చెందిన సాయబ్‌రావు ఇల్లు ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. మంగళవారం తహసీల్దార్ విశ్వంబర్, బీఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబానికి నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో ఇంట్లో ఉన్న వస్తువులు పూర్తిగా కాలిబూడిదయ్యాయని తెలిపారు. ఇంటిని పంచనామా చేసి దాదాపు రూ.20లక్షల ఆస్తినష్టం జరిగినట్లు తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ మనీషా, బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, మాజీ జడ్పీటీసీ శంకర్ చవాన్, రెవెన్యూ సిబ్బంది వెంకటరమణ ఉన్నారు.

విద్యార్థులకు విద్య ప్రాముఖ్యతపై కౌన్సెలింగ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని మదర్స్ కేర్ హైస్కూల్‌లో విద్యార్థులకు నైతిక విలువలు, విద్య ప్రాముఖ్యత అంశంపై మంగళవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఫిబ్రవరి 14న ప్రపంచమంతా 'వాలెంటైన్ డే'గా జరుపుకోవడంలో బిజీగా ఉన్నప్పుడు పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు విద్య పట్ల కౌన్సెలింగ్ ఇవ్వడం హర్షణీయమని వివిధ సంఘాల నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు షోయబ్ అల్తాఫ్, కరస్పాండెంట్ అమీర్, ఉపాధ్యాయులు సాయినాథ్, గీతా, సహెర పాల్గొన్నారు.

ఏజెన్సీలో గిరిజనేతరులకూ పట్టాలివ్వాలి

- రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలి
- రాజ్యాధికార యాత్రలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



నవతెలంగాణ-జన్నారం

ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న గిరిజనులతో పాటు గిరిజనేతరులకు పట్టాలు ఇవ్వాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం రాజ్యాధికార యాత్రలో భాగంగా మండలంలోని ఇందన్‌పల్లి, మురిమడుగు, ధర్మారం, కామన్‌పల్లి, జన్నారం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ టైగర్‌జోన్ పేరుతో అడవిలో ఉన్న గిరిజన గ్రామాలను తరలించడం సబబు కాదన్నారు. తరలించిన ప్రతి కుటుంబంలోని ప్రతి ఒక్కరికి 5ఎకరాల భూమి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బహుజనులకు రాజ్యాధికారం దిశగా బీఎస్పీ పోరాటం చేస్తుందన్నారు. అందుకు ప్రజలు కలిసికట్టుగా రావాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను వారికే కేటాయించాలని సూచించారు. ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం 5.29 లక్షల కోట్ల అప్పులో ఉందన్నారు. ప్రతి తల మీద 1,50,000 అప్పు ఉందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని రైతులను మోసం చేసిందన్నారు. దళితబంధు టీఆర్ఎస్ కార్యకర్తలకు విందుగా మారిందన్నారు. తెలంగాణ ప్రజలను ఓట్లుగా మార్చుకొని స్కీములను స్కాములుగా చేసుకొని దోపిడీకి ఎగబడ్డారన్నారు. నియోజకవర్గంలో ఏ మండలంలో కూడా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణాలు చేపట్టలేదన్నారు. అభివృద్ధి పేరుతో సర్పంచులను గ్రామాల్లో పనులు చేయమని చెప్పి వారికి నిధులు ఇవ్వకుండా ఆత్మహత్యలకు కారణమవుతోందని తెలిపారు. ప్రజా సమస్యలపై బీఎస్పీ నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుందన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ అంతట ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. రాజ్యాధికార యాత్ర మండలంలో మరో రెండు రోజులు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సిడాం రమేష్, ఖానాపూర్ నియోజకవర్గ నాయకులు రాథోడ్ బన్సీలాల్, నిర్మల్ జిల్లా నాయకులు రవీందర్, జగన్, ఎస్కే లక్ష్మి, హారతి, రాజశేఖర్, రమేష్ నాయక్, రాజేందర్, హైదర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో అంతర్గత రహదారులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ హేమంత్ సహదేవరావు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని 15 మండలాల పరిధిలోని గ్రామాలలో చేపట్టిన అంతర్గత రహదారులు, సిసి రోడ్ల పనులను వేగవంతంగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హేమంత్ సహదేవరావు అన్నారు. మంగళవారం అధికారులతో అంతర్గత రహదారులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాలలో మంజూరు కాబడిన సిసి రోడ్ల పనులను వేగవంతం చేయాలని, పనుల పురోగతి వివరాలు, ఫొటోలను పంపించాలని, ఎస్‌టి హ్యాబిటేషన్ గల గ్రామపంచాయతీ కార్యాలయాల కోసం త్వరితగతిన భూమిని గుర్తించి పనులు చేపట్టాలని తెలిపారు. మంజూరు కాబడిన నిర్మాణ పనులకు ఇసుక అవసరం కోసం సమాచారం అందిస్తే సంబంధిత తహసీల్దార్‌తో మాట్లాడి ఇసుక ఇబ్బందులు తలెత్తకుండా, పనులలో అంతరాయం లేకుండా కొనసాగే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. సిసి రోడ్డు పనులను ఎఫ్‌టిఓ మంజూరు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని, గ్రామాలలో రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించి పెండింగ్ లేకుండా చర్యలు చేపట్టడంతో పాటు పనుల పురోగతిపై ఫొటోలను ఎప్పటికప్పుడు తనకు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి, రహదారులు, భవనాలు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట : మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-సారంగాపూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామల అభివృద్ధికి పెద్దపేట వేసిందని రాష్ట్ర దేవాదాయ, న్యాయ, అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ప్యారమూర్ గ్రామంలో రూ.25లక్షల నిధులతో సిసి రోడ్లకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం నూతనంగా నిర్మించిన రజక భవనాన్ని ప్రారభించి భవనంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలో హనుమాన్ మందిర పునర్నిర్మాణానికి రూ.30లక్షలు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ విజయలక్ష్మి, రైతుబంధు జిల్లా అధ్యక్షులు నల్ల వెంకటరామిరెడ్డి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ దివ్యరెడ్డి, లింగారెడ్డి, ఎంపీటీసీ లయ కరుణాసాగర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ మాధవ్‌రావు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు లింగారెడ్డి, లక్ష్మారెడ్డి, మోహన్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఉపాధిలో ఎక్కువ మందికి పని కల్పించాలి

- మంచిర్యాల కలెక్టర్ బాదావత్ సంతోష్



నవతెలంగాణ - హాజీపూర్

ఉపాధి హామీలో ఎక్కువ మందికి పని కల్పించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని గుడిపేట్ గ్రామ పంచయతీలో ఉపాధి హామీ చట్టంలో అమృత సరోవర్‌లో భాగంగా చెరువు పూడిక తీసే పనులను పరిశీలించారు, పని స్థలంలో వేజ్ సీకెర్స్‌తో వేజ్‌రేట్, కొలతల గురించి మాట్లాడారు. తక్కువ మంది కూలీల హాజరుపై అధికారులను ప్రశ్నించారు. అనంతరం ముల్కల గ్రామంలో భూమి అభివృద్ధి పనులు, నర్సరీలో మొక్కల పెంపకం పరిశీలించారు. పల్లెప్రకృతి వనాలు, రైతు వేదికలను పరిశీలించారు. రాపల్లిలో తెలంగాణ క్రీడాప్రాంగణం, పల్లె ప్రకృతి వనం, బృహత్ ప్రకృతివనం, ఐకేపీ ద్వారా చేపట్టిన పంట పొలాలకి ఎరువులు చల్లే డ్రోన్ కెమెరా పని తీరును పరిశీలించారు. ఐకేపీలో ఫండింగ్‌తో చేసిన బేకరి షాప్, ఎంబ్రాడైన్ వర్క్‌షాప్ విజిట్ చేశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ రాహుల్, ట్రైనీ కలెక్టర్ గౌతమి, డీర్డివో శేషాద్రి, ఎంపీపీ మందపల్లి స్వర్ణలత, ఎంపిడిఓ అబ్దులహై, ఏపివో మల్లయ్య, ఏపిఎం శ్రీనివాస్‌గౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

ప్రాక్టికల్ పరీక్షల్లో నిబంధనలు పాటించాలి

- జిల్లా నోడల్ అధికారి శ్రీధర్ సుమన్
- ఎగ్జామినర్లకు జూమ్ శిక్షణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో నేటి నుండి ప్రారంభమయ్యే ప్రాక్టికల్ పరీక్షల్లో బోర్డు నిబంధనలను కచ్చితంగా పాటించాలని మాధ్యమిక విద్యాధికారి డా.శ్రీధర్ సుమన్ అన్నారు. మంగళవారం ఎగ్జామినర్లకు జూమ్ మీటింగ్ నిర్వహించి బోర్డు నియమ నిబంధనల గురించి వివరించారు. ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షల్లో భాగంగా జనరల్, ఒకేషనల్ సబ్జెక్టుల అధ్యాపకులు ప్రాక్టికల్ పరీక్షలకు ఒక సెషన్ ముందుగా కేంద్రాలకు చేరుకొని, ల్యాబ్‌లను పరిశీలించాలని, ప్రయోగ పరీక్షలు నిర్వహించడానికి తగు వసతులను పరిశీలించాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 23కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు అన్ని ఏర్పాట్లు చేసి ఉన్నారన్నారు. పరీక్షకు అర గంట ముందు 8.30గంటలకు ప్రశ్నపత్ర ఓటీపీతో పరీక్ష ప్రశ్నలను ప్రింట్ చేసుకొని నిర్వహించాలని తెలిపారు. పరీక్షా కేంద్రంలో వేళలను కచ్చితంగా పాటించాలన్నారు. ఇంటర్ బోర్డు నియామవళికి లోబడి సబ్జెక్టు పరీక్షలు ఏ పూటకాపూట మార్కులు నమోదు చేయాలని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు 2713, ఒకేషనల్ 1463 విద్యార్థులు మొత్తం 4176 మంది విద్యార్థులకు హాజరు కానున్నారు. పరీక్షల సందర్భంగా విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు నైతం శంకర్, తిరుపతి, నిర్వాహక సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు వ్యవసాయ రంగంలో రాణించాలి



నవతెలంగాణ-తాండూర్

మహిళలు వ్యవసాయ రంగంలో రాణిస్తూ ఆహార పంటల ఉత్పత్తికి తోడ్పాలని బెల్లంపల్లి ఏడిఏ సురేఖ సూచించారు. ఆమె మంగళవారం మండలంలోని ద్వారకాపూర్ గ్రామంలో పులిసెట్టి స్వర్ణరేఖ సత్తయ్య వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ ఆధారిత కుటుంబాల్లో మహిళలు భాగస్వామ్య పాత్ర పోషించాలని తెలిపారు. మహిళా రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ఆహార పంటల సరళిలో మార్కెట్‌కు అనుగుణంగా కూరగాయల పంటలు సాగు చేసినట్లయితే లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. డిమాండ్‌కు అనుగుణంగా కూరగాయల పంటలు సాగు చేయాలని సూచించారు. వ్యవసాయ అధికారులు యాసంగి పంటల నమోదు కార్యక్రమాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఫర్టిలైజర్ షాపులను తరచూ పర్యవేక్షణ చేస్తూ రైతులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, కూలీలు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

నవతెలంగాణ-ఖానాపూర్

విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా ఎదిగినప్పుడే అన్ని రంగాల్లో రాణిస్తారని ఎమ్మెల్యే అజ్మీరా రేఖాశ్యామ్ నాయక్ అన్నారు. ఖానాపూర్ పట్టణంలో ఎఎంకే ఫంక్షన్ హాల్లో ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరీయల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి కన్న తల్లి తండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ పట్టణ మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మైనార్టీలు లోన్‌లను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కడెం

మైనార్టీ లోన్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ లింబాద్రి అన్నారు. మంగళవారం నచ్చన్‌ఎల్లాపూర్ సర్పంచ్ బొడ్డు గంగన్న కలిసి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో పాల్గొన్నారు. సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామంలో మైనార్టీ లబ్ధిదారులకు కార్యాచరణ ప్రణాళిక 2022-23 సంవత్సరం గాను లబ్ధిదారులను బ్యాంకు వారి సౌజన్యంతో ఆర్థిక సబ్సిడీ రుణాలను ఇచ్చేందు లబ్ధిదారులను ఎంపిక చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి మనోజ్, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్ నాయక్, కారోబారి మహేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



యూజీసీ ప్రాదేశిక నిబంధన తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు శాపం

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

యూజీసీ ప్రాదేశిక నిబంధన తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు శాపంగా మారిందని స్వేరోస్ ఇంటర్నేషనల్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు కాంబ్లే విజయ్ కుమార్ అన్నారు. సోమవారం ఇంద్రవెల్లికి వచ్చిన స్వేరోస్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షులు, బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సంద్భంగా స్వేరోస్ ఇంటర్నేషనల్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు కాంబ్లే విజయ్ కుమార్ మాట్లాడుతూ 2013 తరువాత ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుండి దూరవిద్య విధానంలో చేసిన యూజీ, పీజీ సర్టిఫికెట్‌లు యూజీసీ కొత్త నిబంధన వలన చెల్లకుండా పోతున్నాయని అన్నారు. ఈ నిబంధన నుండి తెలంగాణ విద్యార్థులను మినహాంచే విధంగా యూజీసీకి ప్రాతినిధ్యం చేసి 5 లక్షల విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మెన్ ఆర్.లింబాద్రి, యూజీసీ చైర్మెన్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా ప్రయత్నం చేస్తానని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హామీ ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ ఇంటర్నేషనల్ ఆదిలాబాద్ జిల్లా నాయకులు సొన్ కాంబ్లె వికాస్, సాయి చరణ్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నవతెలంగాణ-బాసర

గోదావరి నదిలో మంగళవారం గుర్తు తెలియని యువకుని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై మహేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు గోదావరి నది రెండో ఘాట్ పరిసరాలలో మృతదేహం ఉన్నదన్న సమాచారం మేరకు వెళ్లి పరిశీలించాం. స్థానిక మత్స్యకారుల సాయంతో నదిలో నుండి మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించగా మృతుని వద్ద ఏలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి వయస్సు 25 నుండి 30 సంవత్సరాలలోపు ఉంటుంది. మృతదేహానికి పంచనామా నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుని వివరాలు తెలిసి నట్లయితే ఈ నెంబర్‌కు 8712659540 సంప్రదించాలని కోరారు.

నర్సరీలో మొక్కలు నాటాలి

నవతెలంగాణ-నార్నూర్

గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీలో మొక్కలు నాటాలని నర్సరీ నిర్వాహకులకు ఎంపీడీఓ కావల రమేష్ సూచించారు. మంగళవారం మాన్యాపూర్ గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన నర్సరీ పనులను పరిశీలించారు. మొక్కలను నాటి నీరు పోసి రక్షించాలని ఆదేశించారు. నర్సరీ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి వెంట ఎంపీఓ స్వప్నశీలా, ఏపీఓ సురేందర్, టీఏ వికాస్ చౌహాన్, కార్యదర్శి లవకుమార్ ఉన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మంగళవారం కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు తహసీల్దార్ శ్రీకాంత్ పంపిణీ చేశారు. 20 కల్యాణలక్ష్మీ, 6 షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశామని తహసీల్దార్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పెళ్లి వారి ఇంట్లో ఆనందాన్ని చూస్తున్నామని నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు గోవింద్ రాజు, నాయకులు మక్బుల్, పోశెట్టి, ప్రవీణ్ పటేల్, ఆర్ఐ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీతకు సన్మానం



నవతెలంగాణ-సారంగాపూర్

ఉత్తమ అవార్డు పొందిన మండల ఎంపీఓ తిరుపతిరెడ్డిని మంగళవారం ప్యారామూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ దివ్యరెడ్డి లింగారెడ్డి, ఎంపీటీసీ లయ కరుణాసాగర్ రెడ్డిలు శాలువాతో సన్మానించి, మెమోంటోను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామ పంచాయతీ కార్యదర్శి సౌజన్య, మాజీ సర్పంచ్ స్వామి, కారోబారి భూషణ్‌రెడ్డి, వార్డు సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-తాంసి

మద్యం మత్తులో యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని వామన్‌నగర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అంబుగాం గ్రామపంచాయతీ పరిధిలోని వామన్‌నగర్ గ్రామానికి చెందిన మెస్రం శ్రీనివాస్(21) రోజు అతిగా మద్యం తాగుతూ మద్యానికి బానిసయ్యాడు. సోమవారం రాత్రి అతిగా మద్యం తాగి ఇంట్లో పడుకున్నాడు. అదే ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు ఉదయం పూట ఇంట్లో నుండి బయటకు రాకపోవడంతో కుటుంబీకులు చూడగా తాడుకు వేళాడుతూ విగత జీవిగా ఉన్నాడు. పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై స్వామి సంఘటన స్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ తరలించారు. మృతునికి ఇంకా పెండ్లి కాలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పుల్వామా అమర జవానులకు ఘన నివాళి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పుల్వామా దాడిలో అమరులైన జవాన్లకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కార్గిల్ అమరుల స్థూపం వద్ద సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి, నివాళులర్పించారు. స్థూపానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ మేరకు సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అమరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి, కోశాధికారి సూర్యకాంత్, శ్రీను, మహిపాల్, సతీష్, బండారి దేవన్న పాల్గొన్నారు

కుల, మతాంతర వివాహాలను ప్రోత్సహించాలి

- కుల, మతాంతర వివాహితుల సన్మాన సభలో వక్తల పిలుపు



నవతెలంగాణ-ఆదిలాబాద్అర్బన్

కుల, మతాంతర వివాహాలను ప్రోత్సహించి, తద్వారా కుల నిర్మూలనకు పాటుపడాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా కార్యదర్శి రేంజర్ల ప్రవీణ్ అన్నారు. మంగళవారం స్థానిక పీఆర్టీయూ భవనంలో సంఘం జిల్లా అధ్యక్షులు పవర్ జితేందర్ అధ్యక్షతన జరిగిన కుల, మతాంతర వివాహితుల సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ దేశంలో కుల నిర్మూలన కోసం అంబేద్కర్ చూపిన అనేక మార్గాలలో ముఖ్యమైన మార్గం కులాంతర వివాహమేనని అన్నారు. ముందుగా కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న జంటలను సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కుల సమాజంలో నేడు కులాంతర వివాహాలు చేసుకున్న వారు వెలివేయబడుతున్నారని ఆది దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. కులాంతర వివాహం చేసుకున్న జంట సమాజం ఉండలేక కుటుంబం ఆదరణ లేక నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న వారికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సాయం అందించడంలో అండగా నిలబడటంలోనూ పూర్తిగా విఫలమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. అటువంటి వారికీ ప్రత్యేక ప్రోత్సహకాలు అందించాలని, సమాజంలో గౌరవ ప్రదమైన జీవితం గడపడానికి చేయూత నివ్వాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడాలేని కులవ్యవస్థ భారత దేశంలోనే ఉండటానికి కారణం మనుధర్మ శాస్త్ర వర్ణవ్యవస్తేనని అన్నారు. పేదలు తిరుగుబాటు చేయకుండా దోపిడీ వర్గాలు పేదలను కులం పేరుతో ముక్కలు చెక్కలుగా చేశాయని తెలిపారు. మను ధర్మశాస్త్రం మనుషులను కులం పేరుతో అటు పాఠశాలకి ఇటు ఊరికి చెందకుండా అంతరాయం సృష్టించి ఆస్తులు లేని అనాథలుగా మార్చిందని మండిపడ్డారు. సామజిక సమానత్వం, ఆర్థిక సమానత్వం కోసం నేటి యువత పోరాడాలని అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏ.వెంకట్ మాట్లాడుతూ కులాంతర, మతాంతర వివాహితులకు ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని అన్నారు. ఆదర్శ భావజాలంతో ఒక్కటైన ఆదర్శ దంపతులను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో తాంసి సర్పంచ్ కృష్ణా రత్న ప్రకాష్, సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ముకినెపెల్లి గంగన్న, జి.స్వామి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, రైతు సంఘం అధ్యక్షులు బండి దత్త్రాత్రి, మహిళా సంఘం నాయకులు ఆర్.మంజుల, కే.లలిత, వివిధ గ్రామాల కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న జంటలు పాల్గొన్నాయి.



కళ్యాణలక్ష్మి చెక్కులు, కుట్టు మిషన్ల అందజేత



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

న్యాక్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన భాగ్యనగర్, తిలక్‌నగర్, తాటిగూడ మహిళలకు ఎమ్మెల్యే జోగు రామన్న మంగళవారం మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి కుట్టుమిషన్లు, కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. కుట్టు మిషన్ ధ్రువపత్రాలతో పాటు 41 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. భవన నిర్మాణ కార్మిక కుటుంబ ఆధారిత మహిళలకు శిక్షణ అనంతరం వారికి ఉచితంగా కుట్టు మిషన్‌లను పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. అంతకుముందు పుల్వామా దాడిలో అమరులైన వీర జవాన్ల త్యాగ నిరతిని స్మరించుకుంటూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగురామన్న మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి శిక్షణలు పొందుతూ ఆర్థిక ప్రగతి సాధించాలని అన్నారు. ఆ దిశగా న్యాక్ ద్వారా అందిస్తున్న శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఎండగట్టిన ఆయన ప్రజా సంక్షేమంలో కేంద్రం పూర్తిగా విఫలమయిందని మండిపడ్డారు. అనేక రకాల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి వాటిని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, కౌన్సిలర్లు అశోక్ స్వామి, సంద నర్సింగ్, సంజయ్, కొండ గణేష్, నాయకులు మెట్టు ప్రహ్లద్, సాజిదోద్దీన్, సలీం పాషా, పందిరి భూమన్న, తాటి లక్ష్మణ్, నల్ల మహేందర్, జోహూర్, న్యాక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా, సాంస్కృతిక వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-బేల

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రయివేట్ ఫంక్షన్ హాల్లో క్రీడా, సాంస్కృతిక వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ సూర్య ప్రకాష్ స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, పుల్వామ దాడిలో మరణించిన సైనికులకు ఒక నిమిషం పాటు మౌనం పాటించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ సూర్య ప్రకాష్ కళాశాల ప్రగతి గురించి వివరించారు. దినదినం కళాశాలలో చదివే విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వస్తుందని అన్నారు. కళాశాలలో చదివే విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు రావడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, తమ అమూల్య సందేశాన్ని ఇచ్చి విద్యార్థుల్లో చైతన్యం కల్పించారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన క్రీడా పోటీలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



సీఐటీయూ నాయకుల ముందస్తు అరెస్టు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించ తలపెట్టిన చలో ఎస్పీడీ కార్యక్రమానికి వెళ్లకుండా 27 మంది సీఐటీయూ నాయకులు, మండల ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బందిని మంగళవారం ముందస్తుగా అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కి తరలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ మండల అధ్యక్షురాలు, సీఐటీయూ నాయకురాలు భాగ్య లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకుంటే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని అన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపడానికి బయలుదేరిన తమను అడ్డుకొని అరెస్టు చేయడం తగదని పేర్కొన్నారు. అరెస్టు అయిన వారిలో వెంకట లక్ష్మి, కమల, ఉమా, సునీత, సుశీల, రాజమణి ఉన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ ఉద్యానవనం ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

జిల్లా కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ ఉద్యానవనాన్ని ఎమ్మెల్యే జోగు రామన్న, మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి ప్రారంభించారు. మంగళవారం తాటిగూడ, భాగ్యనగర్, తిలక్‌నగర్ వార్డులలో విస్తృతంగా పర్యటించారు. బాగ్యనగర్ కాలనీలో రూ.45 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ జయశంకర్ మెమోరియల్ ఉద్యానవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం పట్టణాన్ని అన్ని రంగాల్లో ముందంజలో ఉంచుతూ ప్రజల ఇక్కట్లను దూరం చేస్తూ అభివృద్ధిలో ముందుకు సాగుతోందని అన్నారు. ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించడంతో పాటు ప్రతి నిత్యం వ్యాయామం చేసుకునేందుకు వీలుగా ఓపెన్ జిమ్ సదుపాయాన్ని అందుబాటులో ఉంచామని అన్నారు. వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పట్ల హర్షం వ్యక్తం చేశారు. పట్టణాన్ని సర్వాంగా సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు ఏండ్లుగా నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తున్నామని అన్నారు. ఇటీవల ఐటీ టవర్ నిర్మాణానికి సైతం నిధులు మంజూరు అయ్యాయని అన్నారు. కలెక్టర్ కార్యాలయ నిర్మాణాన్ని కూడా త్వరలోనే ప్రారంభిస్తామని పేర్కొన్నారు. గతంలో అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా ఉన్న ప్రాంతాన్ని ప్రస్తుతం అభివృద్ధి చేసి ఆహ్లాదాన్ని పంచే పార్క్‌గా రూపుదిద్దినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, కౌన్సిలర్లు అశోక్ స్వామి, సంజయ్, బండారి సతీష్, నాయకులు కొండ గణేష్, రాము, మిషు, భూమన్న, ధమ్మపాల్, సాజిదోద్దీన్ పాల్గొన్నారు.



నేడు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు. హరిత హారం, విద్యుత్ సరఫరా, తాగు నీటి సమస్యలు, కంటి వెలుగు, విద్య, వైద్యం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

చలో హైదరాబాద్‌కు తరలి వెళ్లిన అంగన్‌వాడీలు



నవతెలంగాణ-నిర్మల్

అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్ల సమస్యల పరిష్కారం కోసం ఛలో హైదరాబాద్ పిలుపు మేరకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ నందు జరిగిన ధర్నాకు జిల్లా నుండి 386 మంది అంగన్‌వాడీలు, హెల్పర్లు మంగళవారం తరలి వెళ్లారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బానోత్ సుజాత, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏ.రాజమణి ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో తరలివెళ్లారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీఐటీయూ రాష్ట్ర నాయకులు జయలక్ష్మిలు అంగన్‌వాడీల సమస్యలు, భవిష్యత్తు కార్యాచరణపై మాట్లాడారని వెల్లడించారు. ఛలో హైదరాబాద్ ధర్నాకు వెళ్లిన వారిలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు లలిత, రజియా, స్వర్ణ, సావిత్రి, వనిత, సరోజ, విజయ, వనజ, స్వరూప, భాగ్య, లక్ష్మి, అంగన్‌వాడీలు ఉన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ ఆత్రం లక్ష్మి సూచించారు. మంగళవారం మండలంలోని జాతర్ల గ్రామ పంచాయతీలో కంటి వెలుగు ప్రారంభోత్సవంలో పాల్గొన్న డాక్టర్ భీంరావు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అంధత్వ నిర్మూలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందని అన్నారు. ఈ శిబిరం గ్రామంలో ఆరు రోజుల పాటు ఉంటుందని ఉచిత కంటి పరీక్షలతో పాటు కండ్లాద్దాలు, మందులు పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఈశ్వర్, పంచాయతీ సెక్రటరీ నవనీత, మాజీ జెడ్పీటీసీ బలరాం, హెల్త్ సూపర్‌వైజర్ దేవిదాస్, సూర్య ప్రకాష్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయాలి

- పాఠశాలలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షల నేపథ్యంలో డీఈఓ ప్రణితతో కలిసి సందర్శించారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పర్యవేక్షిస్తూ, విద్యార్థులు హాజరు శాతాన్ని గమనించారు. విద్యార్థులందరూ హాజరయ్యే విధంగా చూడాలని ప్రధానోపాధ్యాయులు బిక్కును ఆదేశించారు. ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా అదనపు తరగతులకు హాజరై, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయాలని అన్నారు. సిలబస్ త్వరగా పూర్తి చేయాలని, ప్రాజెక్టు బుక్‌లు, ఫేర్ నోట్స్ విద్యార్థులచే పూర్తిగా రాయించాలని తెలిపారు.

ఎస్సైను నెట్టేసిన వ్యక్తిపై కేసు నమోదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్ వద్ద సోమవారం రాత్రి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై కలీం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడుతుండగా ఖుర్షీద్‌నగర్‌కు చెందిన సద్దాం అనే వ్యక్తి తాగిన మైకంలో ఎస్సైను నెట్టివేసి గాయపరిచినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. మంగళవారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు.

రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఉపాధి హామీ పనుల్లో భాగంగా చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం తంతోలి సర్పంచ్ మడవి లక్ష్మీ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తంతోలి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టంలో రోడ్డు పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. రూ.6 లక్షల నిధులతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సెవ్వ జగదీశ్ యాదవ్, ఫిరంగి మల్లేష్, వెంకటేష్, పంచాయతీ సెక్రటరీ మహేష్, సాంబశివ్, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

అనునిత్యం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 15 ఫిబ్రవరి 2023

యోగాతో ఆరోగ్యం మెరుగు



నవతెలంగాణ-కౌటాల

ప్రతినిత్యం యోగా చేయటంతో ఆరోగ్యం మెరుగుపడుతుందని గుండాయిపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గావుడె హన్మంతు అన్నారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులకు యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు యోగా చేయడం వల్ల జ్ఞాపక శక్తి పెరుగుతుందని అన్నారు. నిత్య జీవితంలో యోగా ప్రధానమైనదని అన్నారు. అనంతరం గుండాయిపేట్ ఆరోగ్య ఉపకేంద్రం వైద్యురాలు మాట్లాడుతూ పారిశుధ్యంపై విద్యార్థులకు వివరించారు.

'భూమి తమది కాదని ఇబ్బంది పెడుతున్నారు'

నవతెలంగాణ-కాసిపేట

తమ పేరిట పంట్టా ఉన్న భూమిని ప్రభుత్వ భూమి అంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండలంలోని సోమగూడెం(కె) గ్రామానికి చెందిన ఇస్లావత్ రాజేశ్వర్, మమత దంపతులు ఆవేదవ్యక్తం చేశారు. మంగళవారం కాసిపేట మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సోమగూడెం(కె) పంచాయతీలో ప్రభుత్వ భూమిని ఆక్రమించామని మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని, మాకు పట్టా ఉందని బాధితులు పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా మొక్కలు పెంచుకుంటూ భూమి సాగు చేస్తున్నానమని, తమకు పట్టా ఉందని వివరించారు. సర్పంచ్ కక్ష సాధింపు చర్యలు చేపట్టి ప్రభుత్వ భూమిని కబ్జా చేసినట్లు ఆరోపిస్తూ ఇబ్బందులు పెడుతున్నారని, ఇది పూర్తిగా మా భూమని, తమకు న్యాయం చేయాలని, మమ్మల్ని ఇబ్బందులకు గురి చేయవద్దని వేడుకున్నారు.

శాలివాహన పవర్‌ప్లాంట్ ఎండీ ఇల్లు ముట్టడి

- ప్లాంట్ తెరిచి వేతనాలు ఇవ్వాలని డిమాండ్



నవతెలంగాణ-మంచిర్యాల

పవర్‌ప్లాంట్‌ను పునరుద్ధరించి తమకు న్యాయం చేయాలని కోరుతూ శాలివాహన పవర్‌ప్లాంట్ కార్మికులు మంగళవారం హైదరాబాదులో ప్లాంట్ మేనేజింగ్ డైరెక్టర్ మల్కా కొమురయ్య ఇల్లు ముట్టడించారు. ఈ సందర్భంగా పవర్‌ప్లాంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్ మాట్లాడుతూ కార్మికులకు రావాల్సిన నాలుగు నెలల వేతనాలు మూడు సంవత్సరాల బోనసులు వెంటనే చెల్లించాలని, యధావిధిగా ప్రతినెల వేతనాలు చెల్లించి, కంపెనీలో కార్మికుల బయోమెట్రిక్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. పది సంవత్సరాలపాటు ప్రభుత్వంతో పీపీఏ (పవర్ పర్చేస్ అగ్రిమెంట్) చేసుకుని పవర్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించే విధంగా కృషిచేసి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు రాజు యాదవ్, మల్లేష్, ఎడ్ల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.సత్యనారాయణ, ఎస్.ఆనందరావు, కె.శ్రీనివాస్, కె.సుధీర్, ఎస్.తిరుపతి, కె.బుచ్చయ్య, డి.మల్లయ్య, ఆర్.తిరుపతి, ఏ.శ్రీనివాస్, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆరోగ్య మేళాను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-దండేపల్లి

పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని ప్రభుత్వం ఆరోగ్యమేళా ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తోందని ఆరోగ్యమేళాను మండల ప్రజలు చేసుకోవాలని మండల వైద్యాధికారి సతీష్ సూచించారు. దేశంలోని ప్రతి పౌరుడికీ రూ.5లక్షల ఆరోగ్య బీమాతో కూడిన సౌలభ్యాన్ని కేంద్రం అంద జేస్తుందని అన్నారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డులో ప్రొఫైల్ పొందుపరిచి, ధనిక, పేద అనే తేడా లేకుండా అందరికీ హెల్త్ కార్డులు అందజేసేందుకు కేంద్రం చర్యలు తీసుకుటుందని తెలిపారు. దేశంలోని ఏ దవాఖానలోనైనా ఈ కార్డు నంబర్ చెప్పి వైద్యం చేయించుకునే అవకాశం ఉందన్నారు. ఐదేండ్లు పైబడిన వారికి వ్యాక్సిన్ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వివరించారు. ఆరోగ్య మేళా కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, ఆరోగ్య కార్డు నెంబర్ కేటాయించడం చెవి ముక్కు గొంతు వైద్యం అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మణ్, ఏఎన్ఎం విజయ కుమారి, ఆరోగ్య సిబ్బంది పవన్ కుమార్, అంగన్వాడీ కార్యకర్తలు సావిత్రి, కళావతి, అనురాధ పాల్గొన్నారు.

సేవాలాల్ ఉత్సవాలకు అధికారిక ఏర్పాట్లు చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 21వ తేదీన నిర్వహించే సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు అధికారిక నిర్వాహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సేవాలాల్ ఉత్సవ నిర్వహణ కమిటీ నాయకులు ఆసిఫాబాద్ కలెక్టర్ హేమంత్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి ఉత్సవాలను జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్ పక్కన మైదానంలో నిర్వహించడానికి నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. దీనికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రవి నాయక్, ప్రధాన కార్యదర్శి బాదావత్ శివప్రసాద్, గౌరవ అధ్యక్షులు శంకర్ నాయక్, సలహాదారులు జాధవ్, నాయకులు ఇందులాల్, అంబాజీ, సేసేరావ్, రవీందర్, రూపులాల్ నాయక్, తిరుపతి, రవీందర్, లోకేష్ పాల్గొన్నారు.

ఆయిల్‌ఫామ్ తోటలతో రైతులకు మేలు



నవతెలంగాణ-జన్నారం

ఆయిల్ ఫామ్ తోటలను సాగు చేయడంతో రైతులకు మేలు జరుగుతుందని వ్యవసాయ శాఖ ఏడీఏ అనిత అన్నారు. మంగళవారం మండలంలోని రేండ్లగూడ గ్రామంలో రైతులకు ఆయిల్‌ఫామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీరు నిల్వ ఉండే భూమి తప్ప అన్ని భూములలో ఆయిల్ ఫామ్ తోటలను సాగు చేయవచ్చని తెలిపారు. ఒక ఎకరంలో 57 మొక్కలతో, 9 మీటర్ల దూరం చొప్పున మొక్కలు నాటుకోవాలన్నారు. ఈ పంట వేసిన నాలుగు సంవత్సరాల నుంచి రైతులకు దిగుబడి, రాబడి వస్తుందన్నారు. ఈ ఆయిల్ ఫామ్ చెట్ల మధ్యలో అంతర పంటలుగా పెసర, శనగ మొదలైన పంటలు కూడా వేసుకోవచ్చు అన్నారు. దీంతో రైతులకు అదనపు లాభం చేకూరుతుందని వివరించారు. అనంతరం రైతుల పొలాల్లో పల్లి పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, నెమలి కొండ ఆశారాజ్, ఏఈఓ త్రిసంధ్య పాల్గొన్నారు.

కొంతే 'ఉపాధి'

- దక్కని సగటు కూలి • గిట్టుబాటు కాక ఆర్థిక ఇబ్బంది • అమలుకాని కనీస వేతనం • రూ.600 చెల్లించాలని డిమాండ్

గ్రామీణ ప్రాంతాల్లో పేద, మధ్యతరగతి ప్రజలను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పూర్తి స్థాయిలో అదుకోలేకపోతోంది. పెరుగుతున్న నిత్యావసరాలు, గ్యాస్, ఇంధన ధరలతో పోల్చుకుంటే ఉపాధి కూలీలకు చెల్లిస్తున్న కూలీ ధర సరిపోవటంలేదు. పల్లెలో ఇతర పనులకు వెళితే మగ వారికి రూ.700, ఆడవారికి రూ.500 వరకు కూలి ఇస్తున్నారు. కానీ వయస్సు, ఆరోగ్య కారణాలతో కొందరు ఆ పనులకు వెళ్లలేక పోతున్నారు. ఉపాధి హామీ పనులకు వెళితే కనీస కూలీ లభించటం లేదని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిట్టుబాటు కానీ కూలీకి పోలేక చాలా మంది ఇండ్లలోనే ఉంటున్నారు.

నవతెలంగాణ-హాజీపూర్

జిల్లాలో 16 మండలాలుండగా 310 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 1.21 లక్షల జాబ్ కార్డులు జారీ చేయగా 2.40 లక్షల మంది కూలీలు నమోదై ఉన్నారు. వీరిలో 1.50 లక్షల మంది రెగ్యులర్ పనులకు వెళుతున్నారు. కేంద్ర ప్రభుత్వం కేవలం రూ. 257 మాత్రమే గరిష్ట వేతనంగా ఇవ్వాలని నిర్ణయించగా పలు ప్రాంతాల్లో రూ.150, రూ.200, ఇంకొన్ని చోట్ల రూ. 220 మించి ఇవ్వటం లేదు. దీంతో ప్రభుత్వం కనీస వేతనంగా రూ.600 చెల్లించే విధంగా చట్టంలో మార్పులు చేయాలని పలువురు కూలీలు కోరుతున్నారు.

రూ.200 దాటని రోజు కూలి

ఈ ఆర్థిక సంవత్సరంలో సగటు కూలి రూ.200 దాటలేదు. గత ఏడాది చూస్తే రూ.186 దాట లేదు. కానీ అధికారులు మాత్రం రోజు వేతనం రూ.257 తగ్గకుండా అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నారు. కానీ క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే అమలు కావటం లేదని స్పష్టమవుతోంది. మూడేళ్లలో రూ.200 వేతనం దాటిన దాఖలాలు లేవు.

పెరిగిన ధరలతో సతమతం

కూలీలకు కనీస వేతనాలు అందని పరిస్థితుల్లో కుటుంబాలను పోషించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంటగ్యాస్ సహా పెట్రోల్, డీజిల్, ధరలు పెరుగుదలతో పాటు ఇంట్లో నిత్యం వాడుకునే బియ్యం, పప్పులు, నూనె, కూరగాయల ధరలు విపరీతంగా పెరుగుతుండడంతో ఉపాధి కూలీలు సతమతమవుతున్నారు. ప్రస్తుతం ఇస్తున్న గరిష్ట కూలి సరిపోవడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్షేత స్థాయిలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో గరిష్ట కూలి కూడా దక్కక వేలాది మంది కూలీలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తగ్గుతున్న హాజరు శాతం

గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లతో సమన్వయం చేసుకుంటూ కులీలంతా పనులకు హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత ఏపివోలపై ఉంది. ఇదే విషయం జాబ్ చార్ట్‌లో ప్రధానాంశంగా ఉంది. జిల్లాలో ఈ సీజన్‌లో ఇప్పటి వరకు కేవలం 8వేల మంది మాత్రమే ఉపాధి హామీకి వెళ్తున్నారు. దీనికి కూలి గిట్టుబాటు, ఎండలు, పని గంటలు పెరగడం లాంటి కారణాలు ఉన్నాయి. మంగళవారం కలెక్టర్ సంతోష్ మండలంలోని గుడిపేట్ చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించడానికి వెళ్లగా అక్కడ కూలీల హాజరు శాతం తక్కువగా ఉండటంతో ఏపీఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడున్న కూలీలు కూడా ఉదయం 7గంటలకు వచ్చి మధ్యాహ్నం 2గంటల వరకు పని చేసినా కూలి పడతలేదని కలెక్టర్ ముందు గోడు వెళ్లబోసుకున్నారు.



సంవత్సరం	సగటు వేతనం
2020-21	188.68
2021-22	186.12
2022-23	ఇప్పటి వరకు 200

పని స్థలంలో ఎక్కువ సమయం కేటాయించాలి : మల్లయ్య, ఏపీఓ

ఉపాధి కూలీలు పని స్థలంలో ఎక్కువ సమయం ఉంటూ, నిర్దేశించిన పని చేస్తే దినసరి కూలి పడుతుంది. ప్రస్తుతం క్యూబిక్ మీటర్‌కు రూ.202 కూలి ఉంది. 1.2 క్యూబిక్ మీటర్ పని చేస్తే రూ.257 దినసరి వేతనం పొందొచ్చు.

కనీస కూలీ రూ.600 ఇవ్వాలి

కనికరం అశోక్,
తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి



కూలీలు పొద్దంతా పనిచేస్తున్నా రోజు వారి కూలి రూ.200 దాటడం లేదు. పెరుగుతున్న నిత్యావసర ధరలు దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం గరిష్ట వేతనాన్ని రూ.600కు పెంచి ఇవ్వాలి. అందరికీ పనులు కల్పించాలి. ఆ విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

మొదట కోయపోషగూడలోనే హక్కుపత్రాలు ఇవ్వాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఆశన్న



నవతెలంగాణ-దండేపల్లి

పోడు భూములకు హక్కు పత్రాలు ఇస్తామంటున్న రాష్ట్ర ప్రభుత్వం మొట్టమొదటగా మండలంలోని కోయపోషగూడ గిరిజనులకు హక్కు పత్రాలు ఇవ్వాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆశన్న, జిల్లా కార్యదర్శి సంకె రవి, టీఏజీఎస్ నాయకులు అబ్దుల్లా డిమాండ్ చేశారు. మంగళవారం కోయపోషగూడను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోడు వ్యవసాయదారులకు హక్కు పత్రాలు ఇస్తానని ప్రకటించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. సీపీఐ(ఎం) ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తోందని అన్నారు. కోయపోషగూడ ఆదివాసీలు 2002 నుంచి పోడు భూములు సాగు చేసుకుంటున్న ఫారెస్ట్ శాఖ అధికారులు ఆదివాసులపైన అక్రమ కేసులు పెడుతూ నిర్బంధాలకు గురిచేస్తూ జైలుకు పంపడం సరికాదన్నారు. చంటి పిల్లల తల్లులపైన కూడా అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టడం ఎన్ని నిర్బంధాలు ఎదురైనప్పటికీ ఆదివాసులు పెద్ద ఎత్తున పోరాటం చేసి తమ భూములను కాపాడుకోవటం అభినందనీయమని పేర్కొన్నారు. గత 20 సంవత్సరాలుగా ఇక్కడి ఆదివాసిల పైన విశాఖ అధికారులు అక్రమ కేసులు బనాయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం పోడు సాగు దారులకు హక్కు పత్రాలు ఇస్తామని ప్రకటించడం ఇక్కడి ఆదివాసీల్లో సంతోషం వ్యక్తం అయిందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ ప్రాంతాన్ని పర్యటించాలని వారికి హక్కుపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం దండేపల్లి తహసీల్దార్ హనుమంతరావుకు కోయపోషగూడ ఆదివాసులకు హక్కు పత్రాలు ఇచ్చేలా చూడాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజలింగు, విజయ్, లచ్చ గౌడ్, రవి, బాపు, ఎల్లయ్య, పోచమ్మ, శ్యామల, లావణ్య, రమేష్, నరేష్ పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తులో మరింత మెరుగుపడాలి

- ఆసిఫాబాద్ ఎస్పీ కే.సురేష్ కుమార్
- పెండింగ్ కేసులపై సమీక్ష సమావేశం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేసుల దర్యాప్తులో మరింత పోలీసుల పనితీరు మరింత మెరుగు పడాలని, కేసులు పెండింగ్‌లో లేకుండా చూడాలని ఆసిఫాబాద్ ఎస్పీ కే.సురేష్‌కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని హెడ్‌క్వార్టర్స్‌లో నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకషంగా పరిశోధించి పూర్తి చేయాలన్నారు. రౌడీలు, కేడీలు సస్పెక్ట్‌ల కదలికలపై నిరంతరం నిఘాపెట్టాలన్నారు. అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి పోలీసు అధికారులందరూ న్యాయధికారులతో సమన్వయం పాటిస్తూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పెండింగ్ కేసులను పూర్తిస్థాయిలో ఇన్వెస్టిగేషన్ చేసి డిస్పోజల్ చేయాలని ఆదేశించారు. ఫోక్సో, ఎస్సీ ఎస్టీ గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి, కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాల తనిఖీలు నిర్వహించాలన్నారు. రాత్రి పెట్రోలింగ్‌లో అధికారులు లాడ్జిలు, పాత నేరస్తులను తనిఖీ చేయాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. ఈనెల 11న నిర్వహించిన లోక్ అదాలత్‌లో భాగంగా ఎక్కువ కేసుల రాజీకి తోడ్పడిన పోలీస్‌స్టేషన్ లలో మొదటి స్థానంలో కాగజ్‌నగర్ టౌన్, రెండవ స్థానంలో రెబ్బెన పోలీస్‌స్టేషన్‌లు నిలిచినందుకు ఎస్‌ఐలు చంద్రశేఖర్, భుమేష్‌లకు నగదు ప్రోత్సాహకాలు అందించడంతోపాటు, వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా పోలీస్ శాఖలో చేస్తున్న కృషికి జిల్లా పోలిస్ అధికారులందరికీ మెడల్స్ బహూకరించారు. సమావేశంలో అదనపు ఎస్పీ(అడ్మిన్) అచ్చేశ్వరరావు, అదనపు ఎస్పి(ఏఆర్) భీమ్‌రావు, ఆసిఫాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.



రైతుల ఆదాయం రెట్టింపు చేసేలా పనిచేయాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ హేమంత్ సహదేవరావు
- వ్యవసాయ ఉద్యాన శాఖ అధికారులతో సమావేశం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రైతుల అభివృద్ధి, సంక్షేమంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖలు గుండె వంటివని వారి ఆదాయం రెట్టింపు చేసేలా శాఖలు పనిచేయాలని ఆసిఫాబాద్ కలెక్టర్ హేమంత్ సహదేవరావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు, ఉద్యానవన శాఖ ద్వారా నిర్వహిస్తున్న ఆయిల్ ఫామ్ విస్తరణ పనులపై వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమ అభివృద్ధిలో వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ కీలకపాత్ర పోషిస్తాయని, ఈ క్రమంలో రైతు వేదికలో వారానికి ఒకసారి రెండు శాఖల అధికారులు సమావేశం ఏర్పాటు చేసుకొని సమావేశపు అంశాలను వాట్సాప్ గ్రూపు ద్వారా పంపించాలని సూచించారు. కార్యాలయ పనివేళల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు క్షేత్రస్థాయిలో పనులు పూర్తి చేసి 100 శాతం క్లస్టర్ల వారీగా సమావేశాలు నిర్వహించి రైతులకు చేరువగా పనిచేయాలని సూచించారు. జిల్లాలోని మండలాలలో సాగు చేస్తున్న ఆయిల్ ఫామ్ పంట సాగు వివరాల నివేదిక రూపొందించి అందించాలని, సాగు చేయని మండలాల వివరాలు సైతం పొందుపరచాలని తెలిపారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ఏడీ శ్రీనివాస్ రావు, ఉద్యానవన శాఖ ఏడీ వెంకటేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రజలకు మేలు



నవతెలంగాణ-మంచిర్యాల

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే రాష్ట్ర, దేశ ప్రజలకు మేలు చేకూరుతుందని హాత్ సే హాత్ జోడో అభియాన్ పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌ఛార్జి పట్లోళ్ల సంజీవ రెడ్డి అన్నారు. మంగళవారం హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా 17వ వార్డు అశోక్ రోడ్డులో కాంగ్రెస్ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ చేస్తున్న సేవలను ఉద్యమాలను వివరించారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డితో పాటు ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజల జీవితాలు మెరుగుపడతాయని అన్నారు. అనేక అభివద్ధి, సంక్షేపం పథకాలు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించిందని తెలిపారు. నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో గెలిపిస్తే నియోజకవర్గంలో పురోగతి సాధించి తీరుతుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, పీసీసీ సభ్యులు కొండ చంద్రశేఖర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పుదరి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పెంట రజిత, పట్టణ మహిళ అధ్యక్షురాలు గజ్జెల హేమలత, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రామగిరి బాణేశ్, మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మజీద్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు కౌన్సిలర్ సల్ల మహేష్, కౌన్సిలర్ జోగుల శ్రీలత, డీసీసీ డెలిగేట్ ఆది సంజీవ్, సింగల్ విండో డైరెక్టర్ తూముల వెంకటేష్ పాల్గొన్నారు.

ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ డిమాండ్ చేశారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి సురేందర్‌కు వీఓఏలతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెర్ప్ నుంచి వచ్చే గౌరవ వేతనాన్ని వెంటనే ఖాతాలో జమ చేయాలన్నారు. జీతాలకు సంబంధించి గ్రేడింగ్ విధానం అవలంబిస్తూ డి గ్రేడ్ ఇవ్వడంతో ఆలస్యం అవుతున్నాయని అన్నారు. అలా కాకుండా ఎప్పటికప్పుడు చెల్లించాలన్నారు. వీఓఏలకు ఆన్ లైన్ పనులు చెబుతూ కావాల్సిన సెల్ ఫోన్లను డాటాను ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. పెండింగ్ జీతాలతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు చందేకర్ జ్యోతి, కోశాధికారి సునీత, మండల అధ్యక్షురాలు కల్పన, సభ్యులు మహేష్, రమ, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగం మరువలేనిది

ఆసిఫాబాద్ : పుల్వామా దాడిలో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమర వీరులను మరువలేమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు విశాల్ అన్నారు. పుల్వామా దాడిలో ప్రాణాలు అర్పించిన వీరుల వర్ధంతిని స్మరించుకుంటూ మంగళవారం మండల అధ్యక్షుడు గనేష్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద అమరులకు నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం పుల్వామా దాడిలో 200 మంది సైనికులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. వారి బలిదానం వృథా కాకుండా ముందుకు సాగాలన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చా ఉపాధ్యక్షుడు జయరాజ్, నాయకులు రాజేష్, తిరుపతి, కిరాణ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండ ప్రమోద్, నాయకులు వేణుగోపాల్, నాగరాజ్, రాజేష్, తన్నీరు రాజు, సదన్న, సంతోష్, బన్నీ పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 45 మంది డిబార్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మంగళవారం జరిగిన మొదటి సంవత్సరం డిగ్రీ పరీక్షల్లో రాష్ట్రంలో 50 మంది డిబార్ అయినట్లు కేయు పరీక్షల విభాగం అదనపు అధికారి డా. నరేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి 45 మంది ఉన్నట్లు తెలిపారు. భైంసాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 19 మంది, జన్నారంలోని అజ్మీరా రేఖ శ్యామ్ డిగ్రీ కళాశాలలో తొమ్మిది మంది, బైంసా జీపీఎల్ డిగ్రీ కళాశాలలో ఏడుగురు, ముధోల్‌లోని శ్రద్ధ డిగ్రీ కళాశాలలో ఆరుగురు, లక్షెట్టిపేట తొర్రూర్ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, లక్షెట్టిపేటలోని వాగేశ్వరిలో డిగ్రీ కళాశాలలో ఒక్కరు, లక్షెట్టిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు చొప్పున డిబార్ అయినట్లు తెలిపారు. ఎవరైన కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండలంలోని పొట్టపెల్లి(కె) గ్రామ సర్పంచ్ ఉల్వాజీ హైమావతి రాజు దంపతుల కుమార్తె వివాహం ఇటీవల జరిగింది. మంగళవారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సర్పంచ్ నివాసంలో నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం మంత్రికి కుటుంబ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, ఈటెల శ్రీనివాస్, గుజ్జరి గణేష్, కల్లెడ భూమన్న, వీడీసీ సభ్యులు రవీందర్, భుమారెడ్డి, కోఆప్షన్ సభ్యులు పోతుగంటి రమేష్ కుమార్, గంగారాం, చిన్నారెడ్డి, పోతుగంటి మల్లేష్, ఉల్వాజీ సురేష్, ఉల్వాజీ నరేష్, సాయన్న పాల్గొన్నారు.

జర్నలిస్టుపై దాడికి పాల్పడిన హోంగార్డ్ సస్పెండ్

- డీఎస్పీ సీఎచ్ నాగేందర్



నవతెలంగాణ-ఇచ్చోడ

జర్నలిస్టుపై దాడికి పాల్పడిన హోంగార్డును సస్పెండ్ చేస్తున్నట్టు డీఎస్పీ సీహెచ్ నాగేందర్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో సోమవారం రాత్రి ఓ జర్నలిస్టు కూతురు జన్మదిన వేడుకలకు జర్నలిస్టులు, మండల ప్రజాప్రతినిధులతో పాటు హోంగార్డు హాజరయ్యారు. వేడుకలో జర్నలిస్టుపై ప్రజాప్రతినిది, హోంగార్డు దాడి చేసినట్లు మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో రాత్రి ఫిర్యాదు చేయగా, మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీకి పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాగేందర్, సీఐ నైలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి జర్నలిస్టులపై దాడికి పాల్పడ్డ హోంగార్డ్ విజయ్‌ను సస్పెండ్ చేస్తున్నట్టు జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

రిమ్స్‌లో ఎంసీఐ బృందం తనిఖీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్ మెడికల్ కళాశాలలో పీజీ సీట్ల కేటాయింపు కోసం మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందం మంగళవారం తనిఖీలు చేపట్టింది. రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్‌తో కలిసి అనస్తీషియ, డెర్మటాలజీ, అంకాలజీ, ఎసీపీఎం, జనరల్ మెడిసిన్ విభాగాల్లో పీజీ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ఈ తనిఖీల్లో భాగంగా కళాశాలలో ఆయా వార్డుల్లో రోగులకు అందుతున్న సేవలు, వసతులను పరిశీలించారు. అనంతరం రిమ్స్ డైరెక్టర్ చాంబర్లో సమావేశమై సౌకర్యాలు, వసతులపై సమీక్షించారు. తమ పరిశీలనలో గుర్తించిన అంశాల నివేదికను ఎంసీఐకి నివేదించనున్నట్లు బృందం సభ్యులు తెలియజేశారు. నివేదిక సంతప్తికరంగా ఉన్నట్లయితే ఆయా విభాగాల్లో పీజీ సీట్లు మంజూరు కానున్నట్లు స్పష్టం చేశారు.

అందత్వ నిర్మూలనకే కంటి వెలుగు



నవతెలంగాణ-సారంగాపూర్

అందత్వ నిర్మూలనకే తెలంగాణ ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిదని సర్పంచ్ సముద్రాల సుచరిత రాజేశ్వర్ రావు అన్నారు. మంగళవారం అడెల్లి గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైన అడెల్లి తండలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆమె మాట్లాడుతూ అందత్వాన్ని నిర్మూలించేందుకే సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు కండ్లాద్దాలను అందజేస్తోందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని, రైతుని రాజుగా చూడాలనేదే కేసీఆర్ లక్ష్యమని తెలిపారు. ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తండ వాసులను కోరారు. వృద్దులకు రూ. రెండు వేల పదహారు ఫించన్ ఇస్తున్న ఘనత కేవలం కేసిఆర్‌కే దక్కుతుందని కోనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రేమలత, ప్రేమ్ సింగ్ నాయక్, శివాజీ, రవీందర్, గ్రామస్తులు, డాక్టర్లు అలీ, వేదవ్యాస్, సూపర్‌వైజర్ కేఎం గౌడ్, హెల్త్ అసిస్టెంట్ కిరణ్ కుమార్, టెక్నీషియన్ గణేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో పాటు చదువులోనూ రాణించాలి

- జడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్

నవతెలంగాణ-బోథ్

యువత క్రీడలతో పాటు చదువులోనూ రాణించాలని జడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత చెడు మార్గంలో వెళ్లకుండా సన్మార్గంలో నడవాలని సూచించారు. అలాగే సమయాన్ని వృథా చేయకుండా విద్యార్థులు చదువులపై దృష్టి సారించాలని సూచించారు. మండలంలోని తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఇలా బారీ క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నేరడిగొండ జడ్పిటిసి అనిల్ జాదవ్, ఎంపీపీ తుల శ్రీనివాస్, పిఎసిఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.



ఎల్లమ్మ ఆలయానికి మహర్దశ



నవతెలంగాణ-దిలావర్‌పూర్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆలయాలకు మహర్దశ వచ్చిందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎల్లమ్మ నూతన ఆలయ నిర్మాణానికి, మంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాభై లక్షల నిధులతో నూతనంగా ఎల్లమ్మ ఆలయ పునర్‌నిర్మాణానికి భూమిపూజ చేశామని అన్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన భీమన్న ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరయ్యారు. రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి అత్యధికంగా నిధులు మంజూరు చేస్తూ ఆలయాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. దిలావర్‌పూర్ గ్రామంలో రూ.1 కోటి 50 లక్షలతో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రూ.50 లక్షల తో రేణుక ఎల్లమ్మ దేవాలయం, రూ.20 లక్షలతో కోనేరు నిర్మాణం, ఏక్‌నాథ్ ఆలయానికి రూ.50 లక్షలు, పోచమ్మ ఆలయ షెడ్‌కు రూ.16 లక్షల 50 వేలు, భీమన్న ఆలయాన్ని రూ.10 లక్షలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. నిర్మల్ నియోజకవర్గలో 600 పైగా ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అనంతరం మంత్రి ఎల్లమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాల్దె అక్షర అనిల్, సర్పంచ్ విరేష్ కుమార్, వీడీసీ సభ్యులు నామాయి సాయన్న, పసుల పవన్, నాగరాజు, మహిపాల్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సాదా సీదాగా జెడ్పీ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-నిర్మల్



జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్‌లో సాదాసీదాగా కొనసాగింది. సమావేశానికి జిల్లా పరిషత్ చైర్మెన్ కొరిపల్లి విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఎమ్మెల్సీ దండే విఠల్, కలెక్టర్ వరుణ్‌రెడ్డి హాజరయ్యారు. అధికారులు ఎజెండాలోని అంశాలను శాఖల వారిగా ప్రవేశపెట్టారు. కాగా కుంటాల మండలం ఎంపీపీ గజేందర్ వ్యవసాయానికి విద్యుత్ కోతలపై అధికారులను నిలదీశారు. తరచూ విద్యుత్ కోతలు ఉండటంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పగటి వేళలో విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. కాగా మంత్రి జోక్యం చేసుకొని, గతంలో వారం రోజులపాటు విద్యుత్ కోతలు ఉన్నవి వాస్తవమేనని, వీటిపై సీఎం కేసీఆర్‌తో చర్చించడం జరిగిందని అన్నారు. ఇకముందు విద్యుత్ కోతలు ఉండవని తెలిపారు. సోన్ జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి అక్రమ రేషన్ బియ్యం తరలింపుపై ప్రశ్నించారు. అక్రమంగా బియ్యం తరలిస్తుంటే అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని విమర్శించారు. రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి సన్న బియ్యంగా మార్చి అక్రమాలకు పాల్పడుతున్నారని సభా దృష్టికి తీసుకువచ్చారు. పెంబి జెడ్పీటీసీ జానుబాయి కొత్తగా ఏర్పడిన తమ మండలంలో కనీస సౌకర్యాలు లేవని అన్నారు. మంత్రి జోక్యం చేసుకుని అభివృద్ధి పనులకై ప్రతిపాదనలు పంపామని అన్నారు. సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని త్వరలో పనులు పూర్తయ్యేలా చూస్తామని తెలిపారు. పలువురు జెడ్పీటీసీలు, ఎంపీపీలు అధిక ధరలకు యూరియా, డీఏపీలు విక్రయిస్తున్నారని అన్నారు. సదరు ఫర్టిలైజర్ వ్యాపారులపై చర్యలు తీసుకొని, నిర్దేశించిన ధరలకు విక్రయాలు చేయాలని కోరారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ సుధీర్ పాల్గొన్నారు.

ఆలయాలకు పూర్వవైభవం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

తెలంగాణ రాష్ట్రంలో ఆలయాలకు పూర్వవైభవం ఏర్పడిందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బాబాపూర్ గ్రామంలోని శివాలయంలో శివ పార్వతుల కళ్యాణానికి హాజరయ్యారు. అనంతరం ఆలయంలో రూ.50 లక్షల నిధులతో నిర్మించిన కళ్యాణ మండపాన్ని ప్రారంభించారు. కోనేరు నిర్మాణానికి రూ.30లక్షలు, ఆలయ మరమ్మత్తులకు రూ.10 లక్షలు, హనుమాన్ ఆలయానికి రూ.10 లక్షలు, రెండు భీమన్న ఆలయాలకు రూ.10 లక్షల చొప్పున మొత్తం రూ.20 లక్షలు, మల్లికార్జున ఆలయానికి రూ.15లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు 73 ఆలయాల నిర్మాణానికి, సుమారు రూ.10 కోట్ల నిధులు మంజూరు అయినట్లు మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికి మండలంలో 40 దేవాలయాలు నిర్మాణం పూర్తి అయ్యాయని మరో 13 ఆలయాలు నిర్మాణ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మెన్ కోరిపెల్లి విజయలక్ష్మి రాంకిషన్ రెడ్డి, ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, స్థానిక సర్పంచ్ శ్రీ విద్య, ఆలయ కమిటీ చైర్మెన్ సురేష్ రెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణ రెడ్డి, మండల ఇన్‌చార్జి సురేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ కేశం లక్ష్మి రమేష్, నాయకులు సుభాష్‌రావు, తునికి రాజేశ్వర్, గుజ్జరి గణేష్, శాతం గంగారాం, రామ్ రెడ్డి, సురేష్, పోతుగంటి రమేష్ కుమార్ పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డిని కలిసిన డీసీసీ అధ్యక్షుడు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేపట్టిన హాత్ సే హాత్ జోడో పాదయాత్రకు ప్రజల నుండి విశేషంగా ఆదరణ లభిస్తుందని ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ అన్నారు. రేవంత్ రెడ్డి చేపట్టిన పాదయాత్ర భద్రాచలంలో కొనసాగుతున్న నేపథ్యంలో ఆయనను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై వివరించారు. ఆయన వెంట జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు అడే గజేందర్, నగేష్, ఆనంద్, సంతోష్, రాజు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు స్వయం ఉపాదిపై శిక్షణ

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని వంజర్ గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ చట్టంలో 100 రోజులు పూర్తి చేసుకున్న కూలీలకు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్డీఓ, డీపీఎం ప్రసాద్ మాట్లాడుతూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఉట్నూర్, డీఆర్‌డీఏ ఉపాధి హామీ కూలీలకు శిక్షణ చిరువ్యాపారాలు ఎలా అభివృద్ధి చేసుకోవాలో ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. శిక్షకులు ఆశన్న స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎలా అభివృద్ధి చెందాలో వ్యాపారంలో ఆర్థిక పరమైన జాగ్రత్తలు ఏ విధంగా చూసుకోవాలి అనే అంశంపై శిక్షణను ఇచ్చారు. శిక్షణలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి రూ 256 స్టైఫండ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆరు రోజులు పూర్తి అయిన తర్వాత సర్టిఫికెట్‌తో పాటు వ్యాపారానికి కావాల్సిన డబ్బు ఎస్‌బీఐ ద్వారా ఇప్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ లక్ష్మారెడ్డి, సర్పంచ్ గోనె లక్ష్మణ్, కార్యదర్శి విజయలక్ష్మి, ఉపాధి హామీ కూలీలు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ముట్టడిని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

20న తలపెట్టిన ఐటీడీఏ ముట్టడిని విజయవంతం చేయాలని తుడుం దెబ్బ జిల్లా కార్యదర్శి సోయం రాందాస్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మరో 11 కులాలను ఎస్టీ జాబితాలో చేర్పించుటకు అసెంబ్లీలో తీర్మానం చేయడం ఎంతవరకు సమంజసమని అన్నారు. ఖైతీ లభాన్‌తో బోయవాల్మీకి, మాలీ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చితే ఊరుకునేది లేదన్నారు. సీఎం కేసీఆర్ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ప్రజలకు సాధ్యం కాని హామీలు కురిపిస్తున్నారని విమర్శించారు. ఎస్టీ జాబితాలో చేర్చుతామని చేసిన తీర్మాణాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని హెచ్చరించారు. లేనియెడల ఉధృతం చేస్తామని అన్నారు. దానికి నిరసనగా ఈ నెల 20న ఆదివాసుల ఆధ్వర్యంలో చలో ఐటీడీఏ ముట్టడి కార్యక్రమం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో గేడాం భారత్, సాగర్, జైరాం, వామన్ పాల్గొన్నారు.

రేపు పట్టణంలో జాబ్ మేళా

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఈజీఎంఎం ద్వారా జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ నెల 16న ఉదయం 10 గంటలకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు డీఆర్డీఓ కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. టెలీ సర్వీసెస్ హైదరాబాద్ సంస్థలో నెట్వర్క్ ఇంజినీర్, ఫీల్డ్ టెక్నీషియన్ ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. వార్షిక వేతనం రూ.2.2 లక్షల నుంచి రూ. 5.2 లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల 18 నుంచి 35 ఏండ్లలోపు వారు విద్యార్హత ధృవీకరణ పత్రాలు (ఒరిజినల్), ఆధార్, రేషన్ కార్డు, బయోడేటాతో మేళాకు హాజరు కావాలని సూచించారు.

ఆలయంలో మహాశివరాత్రి ఏర్పాట్లు



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని నంబాల గ్రామంలో శ్రీ ప్రసన్న పరమేశ్వర ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల సంబంధించిన ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రంగు మహేష్ గౌడ్ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రంగ మహేష్ గౌడ్ మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆ ముక్కోటి దేవదేవున్ని దర్శించుకోవడానికి వచ్చే భక్తుల రద్దీ దృశ్య ఆలయ ఆవరణలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామని అన్నారు. నంబల గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ ప్రసన్న పరమేశ్వర ఆలయంలో మహాశివరాత్రి పర్వదిరాన్ని పురస్కరించినని జరగబోయే స్వామి వారి కళ్యాణం, యాత్ర మహోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు సుమారు 60 వేల నుంచి 70 వేల వరకు భక్తులు వస్తారని తెలిపారు.

ఆర్టీసీ బస్సులో గుర్తు తెలియని బాలుడు



నవతెలంగాణ-భైంసా

నిర్మల్ నుండి భైంసాకు వస్తున్న ఆర్టీసీ బస్సులో మంగళవారం తప్పిపోయిన బాలుడిని గుర్తించారు. రోదిస్తున్న బాలుడిని కుభీర్ మండలం నంద్‌పహాడ్ అంగన్‌వాడీ టీచర్ అనసూయ గమనించింది. బాలుని సముదాయించి వివరాలు రాబట్టడానికి ప్రయత్నించగా ఏమీ చెప్పకపోవడంతో ఈ విషయాన్ని సిడిపిఓ నాగలక్ష్మికి తెలియజేసింది. భైంసాలోని ఐసిడిఎస్ కార్యాలయానికి తీసుకొచ్చి భోజనం పెట్టించారు. వివరాలు అడిగినా చెప్పకపోవడంతో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం అధికారుల సూచనల మేరకు ఉన్నతాధికారులకు బాలుని వివరాలు అందజేసి వివేకానంద ఆవాసానికి తరలించారు. బాలుని వివరాలు తెలిస్తే తమను సంప్రదించాలని అధికారులు సూచించారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-బేల



మండలంలోని భోగ్దూర్ గ్రామానికి చెందిన రైతు మహాదేవ్ తాగ్రే కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయాన్ని తెలుసుకున్న రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు ఠాక్రే మంగేష్ తన వంతు సహాయంగా రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని బాధితునికి అందజేసి ఉదారతను చాటుకున్నాడు. ఈ సందర్భంగా మంగేష్ ఠాక్రె మాట్లాడుతూ రైతు మహాదేవ్ తాగ్రే గతంలో గ్రామంలో రైతు వేదిక నిర్మాణానికి భూమిని విరాళంగా ఇచ్చిన వ్యక్తి అని తెలిపారు.

కదిలి పాప హరేశ్వర స్వామిని దర్శించుకున్న మంత్రి



నవతెలంగాణ-సారంగాపూర్

దిలావర్‌పూర్ మండలంలోని కదిలి మాతాన్నపూర్ణ, పాప హరేశ్వర స్వామిని మంగళవారం మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శివరాత్రి ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కదిలి పాపహరేశ్వర స్వామి ఆలయం చాలా పురాతన చరిత్ర కలిగిన ఆలయమని అన్నారు. ప్రతీ సంవత్సరం శివరాత్రి రోజున వేలాది మంది భక్తులు ఆలయాన్ని దర్శించుకుంటారని అన్నారు. సారంగాపూర్ మండలంలోని ప్యారమూర్ నుండి కదిలి దేవాలయం వరకు రూ. 4 కోట్లతో బీటీ రోడ్డు నిర్మిస్తున్నామని తద్వారా మండలం నుండి వచ్చే భక్తులకు దూరభారం తగ్గనుందని అన్నారు. బీటీ రోడ్డు పనులను పరిశీలించి, త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను, అధికారులను ఆదేశించారు. కదిలి ఆలయాన్ని 10 ఎకరాల్లో రూ.10 కోట్లతో అభివృద్ధి చేస్తామని అన్నారు. భక్తుల దర్శనార్థం రహదారులు, మంచి నీటి సౌకర్యం కల్పిస్తామని అన్నారు. మహా శివరాత్రి వేడుకలలో ఆలయ సభ్యులు అందుబాటులో ఉండి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని కోరారు. మంత్రి వెంట జెడ్పీ చైర్మెన్ విజయలక్ష్మి జిల్లా రైతుబంధు అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, ఎంపీపీ మహిపాల్ రెడ్డి, జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, మార్కెట్ చైర్మెన్ శ్రీనివాస్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మాధవరావు, నాయకులు లింగారెడ్డి, ఆలయ చైర్మెన్ భుజంగరావు బీఆర్ఎస్ నాయకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



నవతెలంగాణ-సారంగాపూర్

యువత క్రీడల్లో రాణించాలని మార్కెట్ చైర్మన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ మాధవరావు, సర్పంచుల సంఘం అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని స్వర్ణ గ్రామంలో అల్లోల ట్రస్ట్ అధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీర దారుఢ్యం స్నేహ సంబంధాలు మెరుగుపడతాయన్నారు. ఈ టోర్నీలో తెలంగాణ, మహారాష్ట్రలోని వివిధ జిల్లాల నుండి 35 జట్లు పాల్గొన్నాయి. గెలుపొందిన జట్లకు బహుమతులను ప్రదానం చేశారు. ఖమ్మం జిల్లా కొత్తగూడెం జట్టు మొదటి బహుమతి రూ.21,101, కిన్వట్ జట్టు రెండవ బహుమతి రూ.11,101, స్థానిక స్వర్ణ గ్రామ జట్టు మూడో బహుమతి రూ.5,101ను గెలుచుకున్నాయి. కార్యక్రమంలో స్థానిక నిర్వాహకులు బీఆర్ఎస్ నాయకులు కొత్తింటి మల్లేష్, హాదితో పాటు మండల నాయకులు రాజేశ్వరరావు, లింగారెడ్డి, మల్లేష్ ,గంగారం, క్రీడాకారులు పాల్గొన్నారు.